క్లుప్తంగా

పాఠశాలకు సామగ్రి పంపిణీ



సామగ్రి అందజేస్తున్న గ్రానైట్ మిడ్‌వెస్ట్ సిబ్బంది

కొత్తపట్నం: మండలంలోని కె.పల్లెపాలెంలో ప్రాథమిక పాఠశాలకు ఆంధ్రప్రదేశ్ గ్రానైట్ మిడ్‌వెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ చీమకుర్తి వారు బుధవారం సామగ్రి అందజేశారు. ఇనుప బీరువా 1, కుర్చీలు 4, గోడ గడియారం అందజేశారు. ఏపీఎండీసీ పీవో శివప్రసాద్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు పిన్ని నరసింహారావు, ఏపీ మిడ్‌వెస్ట్ కంపెనీ మేనేజర్ అంబటి శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.వనిత, వైస్ చైర్మన్ సీహెచ్ మస్తాన్, గ్రామ కాపులు సైకం పోతురాజు, తమ్ము వెంకటేశ్వర్లు, సింగోతు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు కొక్కిలగడ్డ సుబ్బారావు, హెచ్ఎం ఎస్‌కే తిరుమలాబి, ఎ.శైలజ, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్హత ఉన్నవారికే పదవులు ఇవ్వాలి

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ నూతన సభ్యులుగా అర్హత ఉన్న వారినే నియమించాలని దళిత సంఘాల వ్యవస్థాపక అధ్యక్షుడు చప్పిడి వెంగళవారం బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమాజ సేవ తెలియనివారికి, చట్టం తెలియని వారికి, రాజకీయ పార్టీలలో ఉన్నవారికి, రాజకీయ పార్టీలు సిఫార్సులు చేసిన వారికి పదవులు ఇవ్వరాదన్నారు.

ఘనంగా పోషణ పక్వాడ వేడుకలు

సంతనూతలపాడు: మండలంలోని చిలకపాడు, మద్దులూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఎనిమిదో రోజు ఘనంగా పోషణ పక్వాడ వేడుకలు నిర్వహించారు. వేములపాడు మెడికల్ ఆఫీసర్ శ్రావ్య, తదితరులు గర్భిణులకు సీమంతాలు చేశారు. రక్తహీనత నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే క్వాలిటీ పోషక పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్య సంరక్షణ సాధ్యమని సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, పార్వతీబాయి సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఏ శ్రీదేవి, అనూరాధ, మాధవి, సాజి, అంజలి, ఏఎన్ఎం శ్రీలత, సచివాలయ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

అలరించిన విజయ దశమి నాటకం



నాటకంలోని ఓ సన్నివేశం

ఒంగోలు మెట్రో: తెలుగు నాటకరంగ దినోత్సవం, కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా బుధవారం రాత్రి ఒంగోలు సీవీఎన్ రీడింగ్ రూమ్ క్లబ్‌లో శ్రీకళ ప్రకాశం ఒంగోలు వారు ప్రదర్శించిన విజయదశమి పౌరాణిక పద్య నాటకం ప్రేక్షకులను అలరించింది. కళాకారుల నటన ఆకట్టుకుంది.

టైలర్ ఆత్మహత్య

ఒంగోలు టౌన్: నగరంలోని సమతానగర్‌లో ఒక టైలర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. సమతానగర్‌కు చెందిన ఉద్దండం యోగయ్య (50) అదే వీధిలో టైలరింగ్ చేస్తూ జీవిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటి నుంచి షాపునకు వచ్చాడు. లోపలకు వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మరణించాడు. కాసేపటి తర్వాత ఆయన భార్య ఫోన్ చేసింది. ఎంతకూ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో షాపు దగ్గరకు వచ్చి చూసింది. షట్టర్ తెరిచి చూడగా, అప్పటికే యోగయ్య మరణించి ఉన్నాడు. ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు. స్థానిక తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడి దంపతులకు సత్కారం



శివనారాయణరెడ్డి, రజనీ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు పంచాయతీ పరిధిలోని బొమ్మినేనివారిపాలెం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయుడి దంపతులను సన్మానించారు. పాఠశాల ఎంఈఓలు చంద్రమౌళీశ్వరరావు, వెంకరెడ్డి, తదితరులు పాల్గొని ఉపాధ్యాయుడు జి.శివనారాయణరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సత్కరించారు. మే 31వ తేదీ ఉద్యోగ విరమణ చేస్తుండగా, ఆ సమయంలో వేసవి సెలవుల కారణంగా ముందస్తుగా పాఠశాలలో శివనారాయణరెడ్డి దంపతులను సత్కరించారు. 30 సంవత్సరాల పాటు ఆయన విద్యాభ్యున్నతికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఉపాధ్యాయులు శ్రీరామమూర్తి, భాగ్యం, మేరీ సృజన, ప్రసూనాదేవి, విజయనిర్మల, రాధారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు

- మండుతున్న ఎండలతో విలవిల్లాడుతున్న ప్రజలు
- మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా రహదారులు
- రాత్రి మంచు.. పగలు ఎండ
- వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందంటున్న వైద్యులు
- అప్రమత్తంగా ఉండాలని సూచన

సంతనూతలపాడు:

వేసవి ప్రారంభంలోనే ఎండలు దడ పుట్టిస్తున్నాయి. నాలుగు రోజులుగా ఎండల తీవ్రత కారణంగా జనం అల్లాడిపోతున్నారు. పగలు భానుడు భగభగలు జనాన్ని తీవ్ర ఇక్కట్లకు గురిచేస్తుండగా, రాత్రివేళల్లో మంచు కురుస్తోంది. వాతావరణం మారుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. నాలుగు రోజులుగా తీవ్రస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ప్రచండ భానుడు నిప్పులు కక్కుతుండటంతో జనం ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. దీంతో జనసంచారం లేక రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. భానుడు ప్రతాపం రోజురోజుకూ ఎక్కువవుతుండటంతో జనం ఇంటికే పరిమితమవుతున్నారు. దీంతో ఒంగోలు, సంతనూతలపాడు మండలాల పరిధిలో నిత్యం రద్దీగా ఉండే రహదారులు సైతం మధ్యాహ్నం వేళ జనం లేక వెలవెలబోతున్నాయి. సాయంత్రం ఐదు గంటలు దాటినా ఎండ తీవ్రత తగ్గకపోతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులు, రోడ్డు పక్కన ఉండే దుకాణదారులు, వ్యాపారులు హడలిపోతున్నారు. గాలి వేడిగా ఉండటం, అధిక మొత్తంలో చెమట పట్టడంతో అవస్థపడుతున్నారు. వేసవి తాపాన్ని తట్టుకోలేక ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. శీతల పానీయాల వైపు పరుగులు తీస్తున్నారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో చల్లటి మజ్జిగ ఇస్తుండటంతో వాటిని సేవించి పాదచారులు, వాహనదారులు వేసవితాపాన్ని తీర్చుకుంటున్నారు. వాతావరణ మార్పులతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ అధికారులు సిబ్బంది సూచిస్తున్నారు.

అత్యవసరమైతే తప్ప ఎండలో బయటకు వెళ్లవద్దని, తప్పనిసరి పరిస్థితులలో వెళ్లాల్సి వస్తే తలకు టోపీ, గొడుగు, మొహానికి మాస్కు ధరించి వెళ్లాలని వారు సూచిస్తున్నారు. రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినరాదని, చల్లని రంగు పానీయాలు తాగరాదని చెబుతున్నారు. ప్రస్తుత వాతావరణం కారణంగా ఇటువంటి పదార్థాలు తీసుకోవడం ద్వారా డయేరియా (విరేచనాలు) తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



గొడుగు వేసుకుని తల్లితో కలిసి ఇంటికి వెళ్తున్న విద్యార్థి

జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలి. లేకుంటే వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. ఎండలో అధికంగా తిరగడం ద్వారా వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. కలుషిత నీరు, ఆహారం, రంగురంగుల పానీయాలు సేవించడం ద్వారా డయేరియా వంటి వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి. ముఖ్యంగా ఎండ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతిఒక్కరూ నీరు ఎక్కువగా తీసుకోవాలి. రోజుకు సుమారు 10 నుంచి 15 గ్లాసులకు పైగా నీటిని తాగాలి. పండ్ల రసాలు, కొబ్బరినీళ్లతో పాటు చల్లటి మజ్జిగ, బార్లీ వంటి పానీయాలు అధికంగా తీసుకోవాలి.

– **రాచేటి ప్రసాద్**, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, సంతనూతలపాడు మండలం









విద్యార్థులకు ఎండ తగలకుండా వస్త్రాలు కప్పి ఇంటికి తీసుకెళ్తున్న తల్లులు



గొడుగులు వేసుకుని స్కూల్ నుంచి ఇంటికి వెళ్తున్న ఒంగోలు బాలాజీనగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినులు

గ్రామస్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలి



చుండూరు రవిబాబును సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నాయకుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న చుండూరు రవిబాబు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి గ్రామస్థాయి నుంచే పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు పిలుపునిచ్చారు. బుధవారం ఒంగోలు మండల పరిధిలోని యరజర్ల గ్రామంలో, పెళ్లూరులోని 17వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులందరూ కలిసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. పార్టీ అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై అభిప్రాయాలు సేకరించారు.

స్థానిక నాయకులతో విడివిడిగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, 17వ డివిజన్ అధ్యక్షుడు నాగం వెంకటరావు, నాయకులు పందిళ్ల ఆంజనేయులు, ఎ.హరిబాబు, పువ్వాడ రామయ్య, సాంబయ్య, బ్రహ్మయ్య, గుడ్డల వెంకటేశ్వర్లు, మేరీ, ప్రసన్న, వాణి, పిగిలి శ్రీనివాస్, 17వ డివిజన్ నాయకులు దేవూరి అజయ్, సన్నేబోయిన హరిబాబు, దుడ్డు సతీష్‌బాబు, సుంకర నాగేశ్వరరావు, సుబ్బారావు, గుమ్మడి వెంకటరావు, వంకె ప్రసాద్, సిరిమల్ల బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలంతా పాఠశాలకు వెళ్లాలి

- డీఈవో కిరణ్ కుమార్



మాట్లాడుతున్న డీఈవో కిరణ్‌కుమార్

కొత్తపట్నం: బడి ఈడు పిల్లలంతా పాఠశాలకు వెళ్లే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఈవో కిరణ్‌కుమార్ ఆదేశించారు. ఈతముక్కల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని డీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే వయస్సులో బడి బయట తిరగకుండా బడిలో ఉండే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. చదువుకునే వయస్సులో పనికి అలవాటుపడితే డబ్బు చూసి చదువుపై ఆసక్తి ఉండదన్నారు. ఈతముక్కల క్లస్టర్ స్థాయిలో ఎన్‌రోల్మెంట్ పెరుగుదల కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉపాధ్యాయులంతా శ్రమించి వచ్చే అకడమిక్ ఇయర్లో పూర్తి స్థాయిలో విద్యార్థులు బడిలో ఉండే విధంగా కృషి చేయాలని తెలిపారు. క్లస్టర్ పరిధిలో పాఠశాల స్థాయిలో ఐదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగిందన్నారు. అందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గీతిక, వైష్ణవి, పావనికి ప్రదానం చేశారు. పాఠశాలలో మొదటి అడ్మిషన్‌ను డీఈవో చేతుల మీదుగా చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి టీచర్లంతా కృషి చేయాలని, మంచి సమాజాన్ని తీర్చిదిద్దాలని కోరారు. ఈతముక్కలలో కష్టంలో ఉన్న స్కూళ్లన్నింటికీ టీఎల్ఎం మెటీరియల్ అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో–2 టి.పద్మావతి, ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు, హెచ్ఎం చెంచు పున్నయ్య, డీసీబీ ఎం.శ్రీనివాసరావు, స్కూల్ సిబ్బంది, క్లస్టర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎగుమతి సుంకాల పెంపును విరమించుకోవాలి

కొత్తపట్నం: రొయ్యల రైతులపై పడుతున్న ఎగుమతి సుంకాల పెంపు భారాన్ని తక్షణమే విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి డిమాండ్ చేశారు. కొత్తపట్నంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం కోమట్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ అమెరికా ప్రభుత్వం భారత దేశం నుంచి వచ్చే ఎగుమతులపై అధిక సుంకం విధించినందున ఆక్వా ఎగుమతులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. ఈపాటికే నాణ్యమైన రొయ్య పిల్లలు, మేత దొరక్క ఇబ్బందుల్లో ఉన్న ఆక్వా రైతులకు సుంకాల పెంపుదల మరింత భారమైందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని ఆక్వా రైతులను ఆదుకోవడానికి తగు చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేస్తోందన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యురాలు కంకణాల రమాదేవి మాట్లాడుతూ ఉప్పు సాగును వ్యవసాయ రంగంగా గుర్తించి ఉప్పు రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. మండలంలో సొంత హక్కులున్న రైతుల వివరాలను ఆన్‌లైన్ చేయనందున ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు దక్కక రైతులు నష్టపోతున్నారని, రెవెన్యూ యంత్రాంగం జోక్యం చేసుకుని రైతుల పాస్ పుస్తకాల ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. సీపీఐ (ఎం) ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించి ప్రజా సమస్యలపై సర్వేలు జరిపి, ముగింపుగా మండల కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు సమర్పించిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు పట్టపు ప్రకాశం, సూరిని స్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం పథకాలన్నీ గిరిజనులకు పూర్తిగా అందాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలాలు గిరిజనులకు పూర్తి స్థాయిలో అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ప్రకాశం భవనంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పీఎం జన్ మన్, డీఏజేజీయూఏ పథకాల అమలులో పురోగతి, క్షేత్రస్థాయిలో సమస్యలు, తదితర అంశాలపై ఆమె పూర్తి స్థాయిలో అధికారుల నుంచి సమాచారం రాబట్టారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కింద జిల్లాలోని గిరిజన ప్రాంత మండలాల్లో హౌసింగ్, రోడ్డు సదుపాయం, తాగునీరు, విద్యుత్ సదుపాయం, బహుళ ప్రయోజనాల కేంద్రాల నిర్మాణం, వందన్ వికాస్ కేంద్రాల ఏర్పాటు, మొబైల్ కనెక్టివిటీ, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు – ఆధునికీకరణ, వంట గ్యాస్ సదుపాయం, నైపుణ్య శిక్షణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. వీటి పురోగతిని ఐటీడీఏ పీఓ శివప్రసాద్ ఈ సందర్భంగా కలెక్టరుకు వివరించారు. దీనిపై ఆమె స్పందిస్తూ ఆగస్టు 15 నాటికి గృహ ప్రవేశం చేసేలా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇతర సదుపాయాల కల్పనలోనూ పురోగతి కనిపించాలని చెప్పారు. మొబైల్ టవర్స్, ఇతర నిర్మాణాలకు అవసరమైన భూమిని త్వరగా కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు కూడా అప్పటికప్పుడే కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి బేబీరాణి, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ వరలక్ష్మి, డీఎస్‌వో పద్మశ్రీ, ఐసీడీఎస్, బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేయాలి



సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

చీమకుర్తి రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు మంచి జరిగేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించి మాట్లాడారు. సామాజిక తనిఖీలో భాగంగా మండల పరిధిలోని 24 పంచాయతీలలో సీఆర్పీలు తనిఖీలు నిర్వహించారని తెలిపారు. కొన్ని పంచాయతీలలో మస్టర్ల విషయంలో తప్పులు జరిగాయని నిర్ధారించి రూ.67,052 రికవరీకి ఆదేశించారు. దస్త్రాలు సక్రమంగా నిర్వహించని వారికి రూ.1000 చొప్పున రూ.29 వేలు జరిమానా విధించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్టుమెంటు వారు ఒక పనికి సంబంధించి రూ.1,11,384కు రికార్డు అందజేయలేదని తెలిపారు. కార్యాలయంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఎండీఓ వి.శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ సునీల్‌కుమార్, పి.అజిత, ప్రజాప్రతినిధులు, సోషల్ ఆడిట్ అధికారులు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక దళం మాక్ డ్రిల్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఒంగోలు టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక సమతా నగర్ 3వ అడ్డరోడ్డులో అగ్నిమాపక దళ సిబ్బంది బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. నివాస గృహాలు, అపార్ట్‌మెంట్లలోని ప్రజలకు వంట గ్యాస్ లీకేజీ వల్ల జరిగే అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే వివిధ రకాల ఆయిళ్లు, విద్యుత్ పరికరాల వలన సంభవించే అగ్ని ప్రమాదాలను నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపకదళ అధికారి కె.శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా సహాయ అధికారి శ్రీనివాసులరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్‌ని చూసి భయపడుతున్న మోదీ

ఒంగోలు వన్‌టౌన్: రాహుల్‌ను చూసి మోదీ భయపడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే సైదా విమర్శించారు. ఒంగోలులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసులో అక్రమంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై చార్జిషీట్ దాఖలు చేశారన్నారు. అప్పుల్లో ఉన్న అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ కంపెనీకి 2002 నుంచి 2011 మధ్య కాలంలో కాంగ్రెస్ పార్టీ రూ.90 కోట్ల సహాయం చేసిందన్నారు. యంగ్ ఇండియా అనే సంస్థ లాభాపేక్షలేని సంస్థ అని, ఆ సంస్థ ద్వారా సహాయం అందించారని తెలిపారు. దీనిని సాకుగా చూపి ఈడీ చార్జిషీటు దాఖలు చేసిందన్నారు. నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు టి.నాగలక్ష్మి, కె.వెంకటకృష్ణారెడ్డి, బీఆర్ గౌస్, పి.విజేష్‌రాజ్, ఎం.ప్రసన్నరాజు, ఎన్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఆరు గొర్రెలు మృతి



సంఘటన స్థలం

సంతనూతలపాడు: టిప్పర్ ఢీకొని ఆరు గొర్రెలు మృతిచెందిన సంఘటన సంతనూతలపాడు మండలంలోని గుడిపాడు డొంక సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. రామతీర్థం నుంచి నెల్లూరుకు కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ మార్గం మధ్యలో గొర్రెల మందను ఢీకొట్టడంతో ఆరు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఐదు గొర్రెలు తీవ్ర గాయాలతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. ఏఎస్సై జి.వెంకట్రావు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. పలువురు గొర్రెల కాపరులు ప్రమాద సంఘటనను పరిశీలించి బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సీతా సమేత కోదండ రామయ్యకు పరిణయ మహోత్సవం



కళ్యాణ వేదికపై సీతా కోదండ రాముడు

ఒంగోలు మెట్రో: మండలంలోని వలేటివారిపాలెం రామక్షేత్రంలో సీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండ రామస్వామి తొమ్మిదో వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని బుధవారం ఆలయ అర్చకులు వైఖానస భగవత్ శాస్త్రానుసారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, మంగళ వాయిద్యాలు, స్వామివారి మూలవిరాట్‌కు సహస్రనామార్చన, తొమ్మిది గంటలకు సీతా కోదండ రామయ్యకు కళ్యాణోత్సవాన్ని శోభాయమానంగా జరిపించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నసంతర్పణలో పాల్గొన్నారు.



కళ్యాణ క్రతువులో పాల్గొన్న దంపతులు

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా ఇబ్రహీం షరీఫ్

ఒంగోలు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా షేక్ ఇబ్రహీం షరీఫ్‌ను నియమిస్తూ ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల వరకు ఒంగోలు ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసి పదోన్నతిపై కృష్ణా జిల్లా అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జిగా ఇబ్రహీం షరీఫ్ నియమితులయ్యారు. తాజా ఉత్తర్వుల్లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా ఆయనను బదిలీ చేశారు. అదేవిధంగా కందుకూరు సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న ఎ.శోభారాణిని కర్నూలు జిల్లా నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. కావలిలో సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.శోభను కందుకూరు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు.

రంగస్థల నటులకు పురస్కారాలు

ఒంగోలు మెట్రో: కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా తెలుగు నాటకరంగ దినోత్సవం రోజైన బుధవారం జిల్లాకు చెందిన ప్రముఖ రంగస్థల నటులు, శ్రీ నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అండ్ అసోసియేషన్ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు, నటుడు ఉన్నం శేషయ్య 2025 సంవత్సరానికిగానూ జిల్లాస్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాలు అందుకున్నారు. బుధవారం రాత్రి విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన సభలో రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. వీరికి పురస్కారాలతో పాటు ప్రశంస పత్రాలు అందజేసి చెరొక 10 వేల రూపాయల నగదు ఇచ్చి ఘనంగా సత్కరించారు.